మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
గురువారం 11 జూన్ 2026 పేజీలు : 4

## వెల్ఫేర్ హాస్టళ్లకు 'మార్పు'

### ఆధునికీకరణకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశం

### సీసీ కెమెరాలు, ఆర్‌వో ప్లాంట్లు, సౌర విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి



జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లను ఆధునికీకరించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. 'మార్పు' పేరుతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సమగ్ర అంచనాలు రూపొందించి ఈనెల 28లోగా సమర్పించాలని సూచించారు.

గుంటూరు, రక్షణ న్యూస్.

వివరాలు 2లో..



వివరాలు 2లో..

# సీఎంవో దాకా చేరిన రక్షణ కలం...

**డీసీ కార్యాలయంలో దేవాలయ వ్యవహారాలపై విచారణ**

**మాజీ ఈవో వెంకటేశ్వరరావును ప్రశ్నించిన అధికారులు?**

**కమిషనర్‌కు నివేదిక.. త్వరలో చర్యలపై నిర్ణయం?**

బాపట్ల సోమేశ్వరస్వామి దేవాలయం వ్యవహారాలపై గత కొన్ని రోజులుగా రక్షణ దినపత్రిక వెలుగులోకి తీసుకొచ్చిన కథనాలకు అధికార యంత్రాంగం స్పందించడం విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లా స్థాయి విచారణ నుంచి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం వరకు వ్యవహారం చేరడంతో దేవాలయ నిధుల వినియోగంపై సమగ్ర పరిశీలన ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ప్రజా ప్రయోజనాలకు అద్దం పట్టిన మీడియా కథనాలను పరిగణనలోకి తీసుకుని చర్యలకు ఉపక్రమించిన ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ యంత్రాంగం, స్పందించిన సీఎంఓ కార్యాలయానికి రక్షణ దినపత్రిక నమస్సుమాంజలి తెలియజేస్తోంది.

**సోమేశ్వరస్వామి దేవాలయంలో సుమారు రూ.13 లక్షల మేర కైంకర్య, దాతల నిధుల వ్యవహారంపై విచారణలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఈవో వెంకటేశ్వరరావు పై రెండు మూడు రోజుల్లో శాఖాపరమైన చర్యలు ఉండొచ్చని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.....**

ఉమ్మడి జిల్లా రక్షణ బ్యూరో

# చివరకు చిక్కిన 'భీముడు'

### ఆసుపత్రి నుంచి పరారైన మోస్ట్‌వాంటెడ్ నిందితుడు అరెస్ట్...

### నాలుగు రాష్ట్రాల్లో గాలింపు తమిళనాడులో పట్టివేత.,...

### ఓఎల్‌ఎక్స్ మోసాల కేసుల్లో మరిన్ని వివరాలపై పోలీసుల దృష్టి

గుంటూరు ప్రభుత్వాసుపత్రి నుంచి పోలీసులను మోసం చేసి పరారైన మోస్ట్ వాంటెడ్ నిందితుడు భీముడు అలియాస్ అజిత్ కుమార్ చివరకు తమిళనాడులో పోలీసులకు చిక్కాడు. ఓఎల్‌ఎక్స్ మోసాల కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్న అతడి కోసం నాలుగు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టిన పోలీసులు ప్రత్యేక బృందాల సహాయంతో అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్టుతో మరిన్ని మోసాల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

గుంటూరు, రక్షణ క్రైమ్ బ్యూరో...



వివరాలు 2లో..

# వెల్ఫేర్ హాస్టళ్లకు 'మార్పు'

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు, రక్షణ న్యూస్.**

జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలకు చెందిన హాస్టళ్లను ఆధునికీకరించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సంక్షేమ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. జిల్లాలో మొత్తం 67 సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయని, వాటిలో 32 హాస్టళ్లు ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ భవనాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం సమగ్ర శిక్ష, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఈడబ్ల్యుఐడీసీ శాఖలకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి హాస్టల్‌కు ఒక అసిస్టెంట్ ఇంజినీర్, ఇద్దరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లను నియమించి పనులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

వసతి గృహాల అభివృద్ధి కార్యక్రమానికి 'మార్పు' అనే పేరు పెట్టినట్లు కలెక్టర్ తెలిపారు. హాస్టళ్లలో ఉండాల్సిన సౌకర్యాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 20 పారామీటర్లను వివరించారు. జిల్లాలోని అన్ని హాస్టళ్లు ఒకే విధానంలో అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

హాస్టళ్లలో పరిశుభ్రత, భద్రత, విద్యార్థుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. టాయిలెట్లలో రన్నింగ్ వాటర్ ఉండేలా చూడాలని, త్రాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డైనింగ్ హాల్, కిచెన్, గదుల్లో సరిపడా లైట్లు, ఫ్యాన్లు, మస్కిటో మ్యాట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థుల క్రీడా అవసరాల కోసం ప్లేగ్రౌండ్‌తో పాటు దాని చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని సూచించారు.

భద్రతా చర్యల్లో భాగంగా హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ ఖర్చులను తగ్గించేందుకు సౌర విద్యుత్ వ్యవస్థలను ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంటలు ఏర్పాటు చేయాలని సూచించారు. చేపట్టే పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఈనెల 28 నాటికి ఖచ్చితమైన అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

వసతి గృహాల్లో ఉన్న పాత ఫర్నిచర్‌ను పరిశీలించి మరమ్మతులు చేయగలిగితే చేయాలని, ఉపయోగించలేని స్థితిలో ఉంటే అనుమతులతో వేలం నిర్వహించాలని సూచించారు.

సమావేశంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ దుర్గాబాయి, ఈడీ బీసీ కార్పొరేషన్ మంజుల, డీడీ సోషల్ వెల్ఫేర్ చెన్నయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పార్థసారధి, ఎస్ఈ పంచాయతీరాజ్ జి.శ్రీనివాసులు, వసతి గృహాల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

# సీఎంవో దాకా చేరిన రక్షణ కలం..

మొదటి పేజీ తరువాయి

**ఉమ్మడి జిల్లా రక్షణ బ్యూరో**

బాపట్లలోని శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయం, భావదేవుని ఆలయం, తూర్పు సత్రం నిధుల నిర్వహణపై గత కొద్ది రోజులుగా వెలుగులోకి వస్తున్న అంశాల నేపథ్యంలో గురువారం జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో కీలక విచారణ జరిగినట్లు సమాచారం. ఈ విచారణకు ప్రస్తుత ఈవో విఠల్ వర్మ, మాజీ ఈవో వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ నాగయ్య హాజరైనట్లు తెలిసింది. దేవాలయాల్లో జరిగిన ఆర్థిక లావాదేవీలు, విరాళాల వినియోగం, కైంకర్యాల నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలించినట్లు సమాచారం. ముఖ్యంగా సోమేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన లెక్కలపై విచారణ సందర్భంగా పలు అంశాలపై అధికారుల దృష్టి కేంద్రీకృతమైనట్లు తెలుస్తోంది. విచారణలో భాగంగా గతంలో నిర్వహించిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించినట్లు సమాచారం. కొన్ని నిధుల వినియోగంపై వివరణలు కోరినట్లు, సంబంధిత అంశాలపై మాజీ ఈవో వెంకటేశ్వరరావును ప్రశ్నించినట్లు తెలిసింది. సెల్ఫ్ చెక్కుల డ్రా, విరాళాల వినియోగం, కైంకర్యాల ఖర్చులకు సంబంధించిన అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. దేవాలయ నిధుల వ్యవహారాలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేసి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపించినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. విచారణ సందర్భంగా సేకరించిన వివరాలు, సంబంధిత పత్రాలు, అధికారుల పరిశీలనల ఆధారంగా నివేదిక రూపొందించబడినట్లు తెలుస్తోంది. అయితే సోమేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన అంశాలు పరిశీలించినప్పటికీ భావదేవుని ఆలయం, తూర్పు సత్రం నిధుల వ్యవహారాలపై పూర్తి స్థాయిలో విచారణ జరగలేదని స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ అంశాలపైనా సమగ్ర దర్యాప్తు జరపాలని భక్తులు, దాతలు కోరుతున్నారు. గత మూడు రోజులుగా రక్షణ దినపత్రికలో ప్రచురితమైన కథనాల అనంతరం అధికార యంత్రాంగం స్పందించినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. దేవాలయాల ఆర్థిక వ్యవహారాలపై వచ్చిన వరుస కథనాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విచారణ ప్రక్రియ వేగవంతమైనట్లు సమాచారం. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు నివేదికను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒకవేళ విచారణలో ఏవైనా అవకతవకలు నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తప్పవని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంపై స్థానిక ప్రజాప్రతినిధులు కూడా దృష్టి సారించినట్లు సమాచారం. దేవాలయ నిధుల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, భక్తుల విశ్వాసానికి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయిలో ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకోవడంతో సీఎంఓ కార్యాలయం వరకు సమాచారం చేరినట్లు స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి. దేవాలయ నిధుల వినియోగంపై వచ్చిన ఫిర్యాదులు, మీడియా కథనాలు, అధికారుల నివేదికల ఆధారంగా ఉన్నత స్థాయిలో సమీక్ష జరిగే అవకాశం ఉందని సమాచారం.

రక్షణ దినపత్రిక ప్రత్యేక కథనాల నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన అంశాలపై అధికారులు స్పందించడం ప్రజాస్వామ్యంలో మీడియా పాత్రకు నిదర్శనంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దేవాలయాల ఆస్తులు, నిధులు, భక్తుల విరాళాల పరిరక్షణలో బాధ్యతాయుత పాత్ర పోషిస్తున్న ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ యంత్రాంగం, అలాగే స్పందించిన సీఎంఓ కార్యాలయానికి భక్తులు అభినందనలు తెలియజేస్తున్నారు.

విచారణ నివేదిక ఆధారంగా రానున్న రోజుల్లో ఎలాంటి నిర్ణయాలు వెలువడతాయన్నది ఇప్పుడు బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఆసక్తికర చర్చగా మారింది...

# చివరకు చిక్కిన 'భీముడు'

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు, రక్షణ క్రైమ్ బ్యూరో...**

గుంటూరు ప్రభుత్వాసుపత్రి నుంచి తెలివిగా తప్పించుకుని పోలీసులకు సవాల్‌గా మారిన మోస్ట్‌వాంటెడ్ నిందితుడు భీముడు అలియాస్ అజిత్ కుమార్ చివరకు పోలీసుల వలలో చిక్కాడు. గత నెల 28న ఆసుపత్రిలో చికిత్స పేరుతో ఉన్న సమయంలో పోలీసుల కళ్లుగప్పి పరారైన అతడి కోసం ప్రత్యేక బృందాలు నాలుగు రాష్ట్రాల్లో విస్తృత గాలింపు చేపట్టాయి. చివరకు తమిళనాడులో అతడి ఆచూకీ గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని గుంటూరుకు తరలించే ప్రక్రియ ప్రారంభించారు.

భీముడు పరారైన ఘటన అప్పట్లో పోలీసు వ్యవస్థలో కలకలం రేపింది. పలు మోసాల కేసుల్లో నిందితుడైన అతడిని పోలీసులు భద్రత మధ్య ఆసుపత్రికి తరలించగా, అక్కడ పరిస్థితులను గమనించి తప్పించుకున్నాడు. ఆసుపత్రి సిబ్బంది, భద్రతా సిబ్బంది కదలికలను ముందుగానే అంచనా వేసి ప్రణాళికాబద్ధంగా పరారైనట్లు దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

పోలీసుల సమాచారం ప్రకారం భీముడు టెక్నాలజీ ఆధారిత మోసాల్లో నైపుణ్యం సంపాదించాడు. ముఖ్యంగా ఓఎల్‌ఎక్స్ వంటి ఆన్‌లైన్ వేదికలను ఉపయోగించి ప్రజలను మభ్యపెట్టి భారీ మొత్తాలు దోచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తక్కువ ధరలకు వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు విక్రయిస్తున్నట్లు ప్రకటనలు ఇచ్చి, ముందస్తు డబ్బులు తీసుకుని మోసాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

అతడిపై ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో కూడా కేసులు నమోదైనట్లు సమాచారం. వివిధ పేర్లతో సిమ్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు వినియోగిస్తూ గుర్తింపును తప్పించుకునే ప్రయత్నాలు చేశాడని అధికారులు చెబుతున్నారు. ప్రతి మోసానికి కొత్త పద్ధతులు అనుసరిస్తూ అమాయకులను లక్ష్యంగా చేసుకున్నాడని దర్యాప్తులో బయటపడింది.

గుంటూరు నుంచి పరారైన తర్వాత భీముడు తరచూ తన స్థావరాలను మార్చుకుంటూ పోలీసులను మభ్యపెట్టినట్లు సమాచారం. సీసీటీవీ ఫుటేజీలు, మొబైల్ సిగ్నల్స్, బ్యాంకింగ్ లావాదేవీల ఆధారంగా పోలీసులు అతడి కదలికలను ట్రాక్ చేశారు. చివరకు తమిళనాడులోని ఓ ప్రాంతంలో దాక్కున్నట్లు గుర్తించి స్థానిక పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకున్నారు.

భీముడు అరెస్టుతో పలు పెండింగ్ మోసాల కేసుల్లో కీలక సమాచారం బయటపడే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. అతడికి సహకరించిన వ్యక్తులు, నెట్‌వర్క్, డబ్బుల లావాదేవీలపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టనున్నారు. పరారీ ఘటనలో నిర్లక్ష్యం వహించిన పోలీసు సిబ్బందిపై కూడా శాఖాపరమైన విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. నిందితుడిని గుంటూరుకు తీసుకొచ్చిన అనంతరం కోర్టులో హాజరుపరచి కస్టడీకి తీసుకునే అవకాశం ఉంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించనున్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/11/2026 5:11 AM Page 3



# ఎరువులకు డిజిటల్ విధానం

**ముండ్లమూరు రక్షణ న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం ఎరువుల పంపిణీ విధానంలో కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి తిరుమలరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది నుంచి యూరియా, డీఏపీ వంటి ఎరువుల పంపిణీని ఆగ్రా×మీ 2.0 యాప్ ద్వారానిర్వహించనున్నట్లు వెల్లడించారు.రైతులు ముందుగా తమ పంట నమోదు వివరాలను సమీప రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్కే)లో ధృవీకరించుకోవాలని సూచించారు. సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన ఎరువులను ఆగ్రా×మీ 2.0 యాప్‌లో ముందస్తుగా బుక్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. బుకింగ్ సమయంలో నమోదిత మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తి చేయాలని చెప్పారు.ఎరువులను ఒకేసారి కాకుండా విడతల వారీగా పంపిణీ చేస్తారని, ప్రభుత్వం సరఫరా కేంద్రాల ద్వారా రైతులకు అందజేస్తుందని పేర్కొన్నారు. ఎరువులు పొందే సమయంలో ఈ-పీఓఎస్ యంత్రం ద్వారా బయోమెట్రిక్ ధృవీకరణ తప్పనిసరిగా ఉంటుందని వివరించారు. రైతులు నేల సార పరీక్షల ఫలితాల ఆధారంగా శాస్త్రీయ పద్ధతిలో ఎరువులను



వినియోగించాలని సూచించారు.రైతు అందుబాటులో లేని పరిస్థితుల్లో అనుమతించబడిన కుటుంబ సభ్యుడు అవసరమైన ధృవీకరణతో ఎరువులు తీసుకోవచ్చన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులను పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం APAIMS 2.0 వ్యవస్థను అమలు చేస్తోందని తెలిపారు."సరైన పంట నమోదు -- శాస్త్రీయ ఎరువుల పంపిణీ -- సమృద్ధిగా పంట దిగుబడి" అనే నినాదంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

## ప్రకృతి వ్యవసాయనికి ప్రోత్సాహం



**ముండ్లమూరు రక్షణ న్యూస్**

ముండ్లమూరు మండలంలోని మారెళ్ళ రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించి, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో భాగంగా రైతులకు ్రావీణ్రా కిట్లను పంపిణీ చేశారు. అలాగే వ్యవసాయ శాఖ 50 శాతం రాయితీతో అందిస్తున్న పచ్చరొట్టె విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలను రైతులకు అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నేల సారాన్ని పెంపొందించడంలో పచ్చరొట్టె పంటలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు సమీప రైతు సేవా కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయం విస్తరణకు, రైతుల ఉత్పత్తి వ్యయాలను తగ్గించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## యోగాంధ్రను విజయవంతం చేయాలి




**పల్నాడు, రక్షణ న్యూస్....**

జిల్లాలో ఈనెల 7వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సంజన సింహ అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమాల ఏర్పాట్లపై జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఈనెల 12న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లను సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గత ఏడాది జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని, ముఖ్యమంత్రి ప్రశంసలతో పాటు రికార్డులు సృష్టించాయని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఈసారి కూడా మరింత మెరుగ్గా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.ఈనెల 12వ తేదీన పెరేడ్ గ్రౌండ్స్ వద్ద ఆశా, ఏఎన్ఎం సిబ్బందితో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా అధికారులు తమ సిబ్బందితో కలిసి పాల్గొనాలని ఆదేశించారు.

## కార్యకర్త కుటుంబానికి చేయూత

**రెంటచింతల రక్షణ న్యూస్**

రెంటచింతల మండలం గోలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు తోడిచెర్ల థామస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా థామస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను ఓదార్చి అనారోగ్యానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిశీలించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు.మృతుడి కుటుంబానికి భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హామీ ఇచ్చి ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తల సేవలను



గుర్తుంచుకుంటామని పేర్కొన్నారు.
పరామర్శ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అబిరెడ్డి, గొట్టు సుమంత్ రెడ్డి, మున్నా ప్రభురాజు, బోడె రామకృష్ణ, గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వృద్ధులకు చేయూత

**గురజాల రక్షణ న్యూస్**




గురజాల మండలం, గంగవరం గ్రామంలోని అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో సోమవారం సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారానికి అంకితంగా, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 66వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని "చేయూత" పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.తెలుగుదేశం పార్టీ అభిమాని, చర్లగుడిపాడు గ్రామానికి చెందిన కావూరి రామారావు సహకారంతో గత 25 నెలలుగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమంలో భాగంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులతో కేక్ కట్ చేయించి ఆనందం పంచుకున్నారు. అనంతరం 25వ నెలకు సంబంధించిన నిత్యావసర సరుకులు బియ్యం, వంటనూనె, కూరగాయలు, పండ్లు, మిఠాయిలను వృద్ధులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు గుండాల మల్లేశ్వరి మాట్లాడుతూ, వృద్ధులకు నిరంతరం అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు.

## వైభవంగా వీరబ్రహ్మోత్సవం



**ముండ్లమూరు రక్షణ న్యూస్**

ముండ్లమూరు మండలంలోని మారెళ్ళ గ్రామంలో ఇటీవల ప్రతిష్ఠించిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ధ్వజస్తంభ మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న 41 రోజుల మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో నిర్వహించారు.తెల్లవారుజామునే ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి స్వామివారికి విశేష పూజలు సమర్పించారు. అనంతరం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొని ఆశీస్సులు పొందారు.పండుగ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కళకళలాడింది. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భజనలు, మంగళవాయిద్యాలు భక్తులను పరవశింపజేశాయి. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి అనుగ్రహంతో గ్రామానికి సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సస్యశ్యామలత్వం కలగాలని భక్తులు ప్రార్థించారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 6/11/2026 5:11 AM Page 4



# స్వర్ణ వార్డుకు నూతన అధికారి గా రాజేష్

బాపట్ల రక్షణ న్యూస్



స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు (ఎస్‌జీఎస్‌డబ్ల్యూ) జిల్లా అధికారిగా ఎస్. రాజేష్‌ను ప్రభుత్వం నియమించింది. కృష్ణా జిల్లా ఉయ్యూరు డీడవోగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు పదోన్నతి కల్పిస్తూ బాపట్ల జిల్లాకు బదిలీ చేశారు. బుధవారం స్థానిక ఎస్‌జీఎస్‌డబ్ల్యూ జిల్లా కార్యాలయంలో రాజేష్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. జిల్లాలోని పలువురు ఎంఎస్‌వోలు, యూఎస్‌వోలు నూతన జిల్లా అధికారిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎస్‌డబ్ల్యూ జిల్లా అధికారి రాజేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన పేదలకు సమర్థవంతంగా అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటానని ఆయన పేర్కొన్నారు.

## హైవేపై ఘోర ప్రమాదం

చిలకలూరిపేట రక్షణ న్యూస్

పల్నాడు జిల్లా చిలకలూరిపేట--ఓడరేవు జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 ఏళ్ల చిన్నారితో సహా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌లోని బాచుపల్లి ప్రాంతం నుంచి చీరాల బీచ్‌కు వెళ్తున్న షిఫ్ట్ కారు వేగంగా ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా టైరు బరస్ట్ కావడంతో అదుపు తప్పి రహదారి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నవీన్ కుమార్ (52), సబితా రాణి (45), నారాయణి (10), శ్రీనివాసరావు (54), విజయ (45) గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సేవమూర్తికి ఘన సన్మానం

కర్లపాలెం రక్షణ న్యూస్



బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం నల్లమోతువారి పాలెం గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ శ్రీమతి పాలే టి నాగేంద్రమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. దీర్ఘకాలంగా అంకిత భావంతో సేవలందించిన నాగేంద్రమ్మను స్థానిక ప్రజాప్రతి నిధులు, గ్రామ పెద్దలు, సహచరులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు మాట్లాడుతూ, పాలేటి నాగేంద్రమ్మ తన సేవా కాలంలో పిల్లల సంక్షేమం, మహిళల అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేసి ఆదర్శప్రాయురాలిగా నిలిచారని కొనియాడారు. ఆమెకు దుశ్శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రామ పెద్దలు, అంగన్వాడీ సిబ్బంది, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొని నాగేంద్రమ్మకు శుభాకాంక్షలు తెలిపారు.

# జగన్ పై జీవి విమర్శలు

వినుకొండ రక్షణ న్యూస్

వైసీపీ హయాంలో కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, వారి జీవితాలతో చెలగాటమాడిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర కార్మికులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. వినుకొండ పట్టణంలో నూతనంగా మంజూరైన జూనియర్ సివిల్ కోర్టు స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన తుగ్లక్ ఇసుక విధానం, కృత్రిమ ఇసుక కొరత కారణంగా నిర్మాణ రంగం తీవ్రంగా దెబ్బతిందని, లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. అదేవిధంగా, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి ఉద్యోగులను మోసం చేసిన వ్యక్తి జగన్ అని ఆరోపించారు. కార్మిక సంక్షేమానికి సంబంధించిన వందల కోట్ల రూపాయల నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటీవల జరిగిన ప్రమాదంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాయని, మృతుల కుటుంబాలను మంత్రులు పవన్ కళ్యాణ్, నారా లోకేష్, వంగలపూడి అనిత పరామర్శించి ఆర్థిక సాయం



ప్రకటించారని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్మికుల ప్రాణాలకు సంబంధించిన విషాద సంఘటనలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం దురదృష్టకరమని, జగన్ శవ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ పాలనలో కార్మికులకు, వారి కుటుంబాలకు జరిగిన అన్యాయాలపై జగన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు.

# పట్టణ అభివృద్ధికి పునాది

చిలకలూరిపేట రక్షణ న్యూస్

పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం పర్యటించి 10, 11, 12, 13 వార్డుల్లో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. ఇదే సందర్భంగా దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి ప్రధాని మోదీ విశేష కృషి చేశారని కొనియాడారు. వరుసగా 12 సంవత్సరాల పాటు ప్రధానమంత్రిగా కొనసాగుతూ దేశ రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



సుపరిపాలన అందిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంతో అభివృద్ధి మరింత వేగవంతమవుతోందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, అభివృద్ధి కార్యక్రమాల ద్వారానే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.

# ఆరోగ్య సేవల మెరుగుదలే లక్ష్యం

**:పల్నాడు** జిల్లా దాచేపల్లి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రిలోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో అదనపు బెడ్లు, ఎయిర్ కండీషనర్లు అవసరమని సిబ్బంది తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని




సూచించారు. ఎన్డీఏ ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ప్రజల ఆరోగ్యమేనని ఎమ్మెల్యే యరపతినేని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, మౌలిక వసతులు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం దాచేపల్లి బస్టాండ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, అక్కడ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.